
# లహరి



"నేను మా పుట్టింటికి వెళ్ళిపోతున్నా" లహరి సూట్‌కేస్ చేతపట్టుకుని పలికింది. పరశురామ్ ఆమెకేసి కసిగా చూసాడు. "నన్ను వదిలి నువ్వు ఇంటివరకూ చేరుకోగలననే అనుకుంటున్నావా?"

ఆమె అదోలా నవ్వింది. "మీరు పెద్ద రియల్టరే కావచ్చు. భూతగాదాల్లో ఎంతో మందిని హత్యచేసి వుండొచ్చు. కాని..." కొద్ది క్షణాలు ఆగాక పలికింది. "... నన్ను భూమ్మీద లేకుండా చేయడం అంత సులభం కాదు. ఎందుకంటే మా నాన్న సామాన్యుడు కాదు. ఆయన నీలాంటి వాళ్ళను ఎంతోమందిని చూసాడు. నాకేదైనా జరిగిన మరుక్షణం నువ్వూ ఈ భూమ్మీద వుండవని గుర్తుంచుకో..."

అతడు కంగారుగా "ఏయేయ్! నువ్వు... నన్ను మాట్లాడుతున్నదేంటి!... నేను నిన్ను చంపిస్తానా?! నేనేదో అంటే, నువ్వలా అర్థం చేసుకోవడం బాగోలేదు." పలికాడు.

"బాగున్నా బాగోలేకపోయినా యాక్షన్‌కి రియాక్షన్ ఎలా వుంటుందో చెప్పాను. ...ఇక అడ్డు తప్పుకోండి" ఆమె సూట్‌కేస్ పట్టుకుని బయటకు నడిచింది.

పరశురామ్ చేష్టలుడిగి అలా వుండిపోయాడు.

※ ※ ※

వేగంగా వచ్చిన స్కార్పియో సడన్ బ్రేక్‌తో ఇంటి ముందు ఆగింది. అందులోనుండి దిగిన ఐదుగురు వ్యక్తులు వడివడిగా లోపలికెళ్ళారు.

హాల్లోకి వెళ్ళగానే ఒక వ్యక్తి పెద్దగా అరిచాడు. "రేయ్ పరశురామ్!".

బెడ్‌రూమ్‌లో డ్రస్ ఛేంజ్ చేసుకుంటున్న పరశురామ్ ఆ అరుపుకి అదిరిపడ్డాడు. ఆ అరుపు ఎవరిదో అతడికి తెలుసు.

శ్రీశైలం... తన మామ!

అతడు కంగారుగా హాల్లోకి వచ్చాడు. "మామయ్యా!... మీరు... "పలకరింపు ఇంకా పూర్తికాలేదు. ఆ నలుగురు అతడిని చుట్టుముట్టి గట్టిగా పట్టుకున్నారు. శ్రీశైలం దగ్గరగా వచ్చి అతడి కడుపులో బలంగా గుద్దాడు. కడుపులో ప్రేగులన్నీ చుట్టచుట్టుకుని పోయినట్టు అయ్యింది. "... ఎందుకు ...ఎందుకు నన్ను కొడుతున్నారు?"

శ్రీశైలం మరో గుద్దు గుద్దాకే పలికాడు. "ఎందుకేంట్రా! నా కూతుర్ని చంపినందుకు... అందుకే నిన్ను చంపాలనే వచ్చాను."

బాధను కూడా మర్చిపోయేంతగా షాక్‌కి లోనయ్యాడు పరశురామ్. "లహరి... లహరి చనిపోయిందా?"

"చంపేసి, చనిపోయిందా?! అంటావేంట్రా బద్మాష్" ఈసారి కాలుతో కడుపు మీద కొట్టాడు.

దెబ్బ మరింత బలంగా తగలడంతో, దూరంగా పడ్డాడు పరశురామ్. తల దిమ్మెక్కినట్టయ్యింది. తల విదిలిస్తూ "మామయ్యా! నిజం చెప్పుతున్నాను... లహరిని నేను చంపలేదు... అసలు నా భార్యను నేనెందుకు చంపుతాను?" పలికాడు.

"ఎందుకు చంపుతావంటే - నీకు నీ పెళ్ళాం మీద అనుమానం. అందుకే దాన్ని చిత్రహింసలకు గురిచేసావు. అది తట్టుకోలేక పుట్టింటికి బయల్దేరితే, 'నువ్వు ఇంటివరకూ ఎలా చేరుకోగలవ్?'- అంటూ కూడా బెదిరించావ్... ఇదంతా తను ఫోన్‌లోనే చెప్పింది."

వాళ్ళ కోపానికి కారణం అర్థమయ్యింది. కాని లహరి హత్యకు కారణమేంటి?! "ఐనా లహరి కూడా తల్లిదండ్రులకు ఇలా చెప్పిందెందుకని? ఆమెను తను అనుమానించలేదు. తననే ఆమె అనుమానిస్తూ, రోజూ నరకం చూపించేది... చివరికి చస్తూ కూడా కష్టాలపాలు చేసి వెళ్ళిందా?!" పరశురామ్‌కి మనసంతా ఏదోలా అయిపోయింది.

కసిదీరా కొట్టాకనే వాళ్ళు అతడిని పోలీసులకు అప్పగించారు.

తనను చంపకుండా వదిలినందుకు సంతోషించాడు పరశురామ్.

※ ※ ※

మెల్లగా తలుపు తెరిచిన ఎస్.ఐ. తివిక్రమ్ అటు చూస్తే, సి.ఐ. ధనుంజయ్ దీర్ఘాలోచనలో మునిగిపోయి వున్నట్టు కనిపించాడు.

"సార్" పిలిచాడు తివిక్రమ్.

తలెత్తి చూసాడు ధనుంజయ్ "కమిన్... కూర్చో తివిక్రమ్."

అతడు లోపలికెళ్ళి కూర్చున్నాక అడిగాడు. "ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నట్టున్నారు?"

"అదేనయ్యా!... శ్రీశైలం కేసు గురించి... అతడి కూతుర్ని ఎవరో మర్డర్ చేసారు కదా?!..."

**జె.వి.బాబు**

"అల్లుడే హంతకుడని, అతడే అప్పగించాడు కదా?" సి.ఐ. మాటలు మధ్యలోనే కట్ చేస్తూ పలికాడు తివిక్రమ్.

ధనుంజయ్ తల అడ్డంగా ఆడించాడు. "అతడు అప్పగిస్తే- అప్పగించినవాడే హంతకుడని ఎలా నిర్ణయిస్తాం?... పైగా పరశురామ్ తనీ హత్యచేయలేదనే అంటున్నాడు."

"హంతకుడెప్పుడూ తను హత్య చేయలేదనే అంటాడు. మనమే రెండు తగిలిస్తే 'నిజం' బయటకొస్తుంది."

"అలా కొట్టకూడదనే కదా- ఫోరెన్సిక్ ల్యాబ్ సహాయం తీసుకుంటున్నది."

ఫోరెన్సిక్- చట్టానికి సహాయపడే శాస్త్రం. ఒకప్పుడు నేరం చేసారన్న అనుమానం కలిగితే పోలీసులు కొట్టి, హింసించి, థర్డ్ డిగ్రీ పద్ధతులతో నేరస్తుడి ద్వారా నిజం చెప్పించేవారు. అలాంటప్పుడు కొంతమంది అమాయకుల్ని కూడా అనుమానితులుగా భావించి బాధించడం జరిగేది. 'శారీరక హింస కరెక్ట్' కాదంటూ మానవ హక్కుల సంఘాలు ఆందోళన చేయడంతో పోలీసులు లాఠీలకు పనిచెప్పడంకన్నా, బుర్రకు పనిచెప్పడం మొదలుపెట్టారు. క్లూస్ సేకరించడం ద్వారా నేరస్థుడ్ని నిర్ధారించే ప్రక్రియ ఇప్పుడిప్పుడే మొదలయ్యింది. పోలీసులు చేసే ఇన్వెస్టిగేషన్‌కి సహాయపడే శాస్త్రమే- ఫోరెన్సిక్ సైన్స్.

ఈ విషయం తివిక్రమ్‌కి కూడా తెలుసు. కాకపోతే ఏదో మూడ్‌లో అలా అన్నాడు అంతే.

"మరి ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్ట్ వచ్చాయా?"

"వచ్చాయి... కాని వేలిముద్రలు, ఇతరత్రా ఆధారాలు- పరశురామ్ ఈ హత్య చేయలేదనే చెపుతున్నాయి."

"ఇతడు ఆ హత్య చేయకపోవచ్చు. ఎవరైనా కిరాయి హంతకులను ఉపయోగించి వుండొచ్చు కదా?!" ఎస్సయ్ అనుమానం వ్యక్తం చేసాడు.

"శ్రీశైలం కూడా అదే అంటాడు. కాని ఆ హంతకులెవరు? అసలీ కేసుని ఎక్కడి నుండి మొదలుపెట్టాలి?... ఊహుఁ! ఏమీ అర్థకావడంలేదు." సి.ఐ. తల పట్టుకున్నాడు.

"మనం హత్య జరిగిన ప్రదేశాన్ని, మరోసారి పరిశీలిస్తే బాగుంటుందేమో సార్"

"ఎందుకు?"

"మరోసారి మరింత నిశితంగా పరిశీలించొచ్చేమోనని."

సి.ఐ. ధనుంజయ్ భుజాలెగరేసాడు. "సరే వెళ్దాం పదా."

※ ※ ※

"ఆరోజు శవం ఇక్కడ దొరికింది. కాని హత్య ఇక్కడ జరగలేదు. అవునా సార్?" ధనంజయ్ నిలువుగా తలాడించాడు. "అవును."

"మరి హత్య ఎక్కడ జరిగింది?"

"అదే అర్థంకావడంలేదు... ఆమె రైల్వేస్టేషన్‌లో దిగాక ఆటో స్టాండ్‌వైపు వెళ్ళివుండాలి. ఆటో ఎక్కాక ఆమెను మరెవరైనా పికప్ చేసుకున్నారా?!"

"మీరిప్పుడు కరెక్ట్ రూట్లో వస్తున్నారు సార్! ఖమ్మంలో బయల్దేరిన లహరి రాత్రి పది పదకొండు గంటల మధ్య సమయంలో సికింద్రాబాద్ చేరుకుంది. ఆమె వెళ్ళవలసింది కూకట్‌పల్లి వైపు కాబట్టి నంబర్ వన్ ప్లాట్‌ఫారంనుండి బయటకొచ్చి వుంటుంది. ఆటో ఎక్కివుంటే ఆటో డ్రైవర్ తనను దారి మళ్ళించి తీసుకెళ్ళి మర్డర్ చేసేంత పరిస్థితి లేదు. నేను అనుకోవడం తను

స్టేషన్ దిగేసరికి, ఎవరో తెలిసిన వ్యక్తి హఠాత్‌గా కనిపించి వుండొచ్చు... ఏమంటారు?"

త్రివిక్రమ్ కేసి అభినందన పూర్వకంగా చూసాక, "యూ ఆర్ రైట్ త్రివిక్రమ్! బట్... ఆ వ్యక్తి ఎవరు?" ప్రశ్నించాడు.

"ఇక్కడ మనం పరశురామ్ కోణంలో పరిశోధించడం ఆపి, శ్రీశైలం కోణంలో, లేదా లహరి కోణంలో పరిశోధిస్తూ ముందుకెళ్ళడం మంచిదనుకుంటున్నాను."

"అంటే?"

"లహరి ఫ్రెండ్స్ ఎవరైనా స్టేషన్‌లో కలిసారా? లేక శ్రీశైలం ప్రత్యర్థులు ఆమెను అక్కడ చూసారా?!..."

"నిజమే మనం ఆ కోణంలోనూ పరిశోధన సాగిస్తే మేలు."

ఎస్.ఐ. త్రివిక్రమ్ చిన్నగా నవ్వి చెప్పాడు. "ఐతే మన మిప్పుడు శ్రీశైలం ఇంటికెళ్ళాలి."

మోటార్ బైక్ శ్రీశైలం ఇంటి వైపు వెళ్ళింది.

* * *

శ్రీశైలం వారిద్దరికేసి అనుమానంగా చూసాడు. "హంతకుడే దొరికితే ఇంకా ఈ ఇన్వెస్టిగేషనేంటయ్యా?" చిరాగ్గా పలికాడు.

"మీ అభిప్రాయం మీకున్నట్టే, మా అనుమానాలు మాకున్నాయి. కాబట్టి మీ అమ్మాయి ఫ్రెండ్స్ లిస్ట్, అలాగే మీ ప్రత్యర్థుల పేర్లు మాకు కావాలి." చాలా కూల్‌గా పలికాడు సి.ఐ. ధనుంజయ్.

అనీజీగా కదలాడుతూనే తన ప్రత్యర్థుల పేర్లు, లహరి ఫ్రెండ్స్ లిస్ట్ ఇచ్చాడు శ్రీశైలం. వాటిని నోట్ చేసుకున్నాడు ఎస్.ఐ త్రివిక్రమ్.

ఆ లిస్ట్ తీసుకుని బయటకొచ్చాక ధనుంజయ్ అడిగాడు. "పరిశీలించాల్సిన పేర్లు మన చేతిలో వున్నాయి. కాని ఎక్కడ, ఎలా మొదలుపెడుదాం?"

"లహరి క్లోజ్ ఫ్రెండ్ జ్యోతి దగ్గర నుండి మొదలుపెడుదాం."

"అక్కడినుండే ఎందుకు?"

"క్లోజ్ ఫ్రెండ్ కాబట్టి బాధలో కొన్ని విషయాలు బయటపడొచ్చు. ఆ విషయాలే మనకు ఆధారం కావచ్చు."

"సరే పదా" అక్కడి నుండి వెహికల్ కదిలించాడు ధనుంజయ్.

ఆ ఇంటికి కిలోమీటర్ దూరంలోనే వుంది జ్యోతి ఇల్లు.

* * *

లహరి గురించి అడగ్గానే మొదట భయపడింది జ్యోతి. ఆ తర్వాత ఏమీ చెప్పకుండా తప్పించుకోవాలని చూసింది. అనేక రకాల భరోసాల తర్వాత తనకు తెలిసిన విషయాలు వివరించింది.

"... పరశురామ్ గురించి నాకు తెలియదు గానీ, లహరి పెళ్ళికి ముందు మరొకర్ని ప్రేమించింది. కాని ఆ కుర్రాడ్ని శ్రీశైలం మనుష్యులు చంపేసారు. ఆ బాధతో లహరి డ్రగ్స్ తీసుకోవడం మొదలుపెట్టింది. అందుకే ఖమ్మంనుండి నెలకోసారి హైదరాబాద్ పరుగెత్తుకొచ్చేది... బహుశా ఈ విషయం ఆమె భర్తకు తెలుసో, లేదో... కాని బయటపడకుండా మేనేజ్ చేయడమూ కష్టమే కదా!..."

ధనుంజయ్ వెంటనే అడిగాడు. "అంటే ఆమె డ్రగ్స్‌కోసమే హైదరాబాద్ వచ్చిందంటావా?"

"ఎందుకొచ్చిందో నాకు తెలియదు. బట్,... వచ్చిన వెంటనే డ్రగ్స్‌కోసం పరుగెడుతుంది. అది నిజం."

'డ్ర... గ్స్...'

ధనుంజయ్, త్రివిక్రమ్‌కేసి చూసాడు. "సో! ఆమె రైల్వే స్టేషన్ నుండి తిన్నగా యూనివర్శిటీ వైపు వెళ్ళింది. మరి యూనివర్శిటీ దగ్గర డ్రగ్ తీసుకుందా...?!... లేదా?"

* * *

ఫొటో చూడగానే ఆ వ్యక్తి గుర్తుపట్టాడు. "ఆమెను అప్పుడప్పుడు ఇక్కడ చూస్తూనే వుంటాను. ఆరోజు కూడా తను సూట్‌కేస్‌తో కనిపించింది. కాసేపటికి ఓ వ్యక్తి ఇక్కడికి వచ్చాడు. తను అతడికి డబ్బులివ్వడం, డ్రగ్ తీసుకోవడం చూసాను."

"ఆ తర్వాత".

బడ్డీకొట్టు వ్యక్తి తల గోక్కున్నాడు. కాసేపు కళ్ళుమూసుకుని, గుర్తు తెచ్చుకుంటున్నట్టుగా ఎటో చూస్తుండిపోయాడు. అప్పుడే గుర్తుకొచ్చిందేమో కళ్ళు తెరిచి, హుషారుగా పలికాడు. "... కరెక్ట్... ఆమె డ్రగ్ తీసుకుని కదలబోతుంటే, ఒక సుమో వచ్చి ఆగింది. ఆ సుమోలో వున్న వ్యక్తి ఆమెను పలకరించాడు. ఇద్దరూ ఆ వెహికల్‌లోనే వెళ్ళారు."

"ఇతడేనా ఆ వ్యక్తి?" జేబులోనుండి పరశురామ్ ఫొటో తీసి చూపించాడు ధనుంజయ్.

పరిశీలనగా చూసిన ఆ వ్యక్తి తల అడ్డంగా ఆడించాడు. "ఆ కుర్రాడు కాస్త స్మార్ట్‌గా వున్నాడు సార్!"

"చూస్తే గుర్తుపట్టగలవా?"

"గుర్తుపట్టగలననే అనుకుంటున్నాను."

కేసు కొత్త మలుపు తిరుగుతున్నట్టుగా అనిపించింది ఆ ఇద్దరికీ. వాళ్ళు అక్కడినుండి హుషారుగా కదిలారు.

* * *

శ్రీశైలం ద్వారా చాలా ఫొటోలు సేకరించి, అవన్నీ బడ్డీకొట్టు వ్యక్తికి చూపిస్తే వాళ్ళెవరూ కాదనే సమాధానం వచ్చింది.

మరా వ్యక్తి ఎవరు?!... ఎలా దొరుకుతాడు?!

"మనం ఆ డ్రగ్స్ అమ్మే వ్యక్తిని అదుపులోకి తీసుకుంటే?!" త్రివిక్రమ్, ధనుంజయ్‌తో అన్నాడు.

"ఎందుకు?"

"శ్రీశైలం వైపు ఎవ్వరూ కానప్పుడు, డ్రగ్స్ అమ్మే వ్యక్తి వైపు ఎవరైనా వుండొచ్చుగా?"

"యూ ఆర్ రైట్."

"ఐ యామ్ ఆల్వేస్ రైట్ సార్" నవ్వాడు త్రివిక్రమ్.

* * *

డ్రగ్స్ అమ్మే వ్యక్తి తప్పనిసరి అనుకుని వివరాలు చెప్పాడు. "ఆమె చాలా కాలంగా డ్రగ్స్ తీసుకెళ్తోంది సార్! ఆరోజు కూడా తను డ్రగ్స్ తీసుకుని వెళ్ళబోతుంటే, సంజయ్ వచ్చాడు..."

"సంజయ్?!" ధనుంజయ్ కనుబొమలు ముడిపడ్డాయి.

"... మీరనుకుంటున్నది కరెక్టే సార్! ఎమ్మెల్యే రాజలింగంగారి అబ్బాయి. తనకు కూడా డ్రగ్స్ తీసుకునే అలవాటుంది."

ధనుంజయ్, త్రివిక్రమ్ ఒకరినొకరు చూసుకున్నారు.

"సరే! సంజయ్, లహరిని ఎక్కడికి తీసుకెళ్ళి వుంటాడు, ఎందుకు తీసుకెళ్ళి వుంటాడు?" త్రివిక్రమ్ ప్రశ్నించాడు అతడిని.

"సాధారణంగా డ్రగ్స్ అలవాటున్నవాళ్ళు ఒంటరిగా కాదు, కలసి ఎంజాయ్ చేయాలనుకుంటారు. అందుకే వాళ్ళిద్దరూ కలసి ఎక్కడికో వెళ్ళి వుండొచ్చు."

లహరి పెళ్ళికి ముందు మరొకర్ని ప్రేమించింది. కాని ఆ కుర్రాడ్ని శ్రీశైలం మనుష్యులు చంపేసారు. ఆ బాధతో లహరి డ్రగ్స్ తీసుకోవడం మొదలుపెట్టింది. అందుకే ఖమ్మంనుండి నెలకోసారి హైదరాబాద్ పరుగెత్తుకొచ్చేది...

"కరెక్టే కదా సార్! మందు ఒంటరిగా తాగలేం. బార్ కెళ్ళాలంటే కంపెనీ వుండాలి. డ్రగ్స్ తీసుకునేప్పుడూ కంపెనీ కావాలి" త్రివిక్రమ్ నవ్వాడు.

"నవ్వాపి ముందు ఇతడి స్టేట్‌మెంట్ రికార్డ్ చేయి... ఎందుకంటే మనం నెక్స్ట్ కలవబోతున్నది సంజయ్... ఎమ్మెల్యే కొడుకు. ఆధారాలు లేకుండా అధికార పార్టీ ఎమ్మెల్యే కొడుకును అనుమానిస్తే, ఆ తర్వాత మన పోస్టింగ్స్‌కే ప్రమాదం వస్తుంది."

"ఇప్పుడు నేను చెపుతున్నాను... యూ ఆర్ రైట్ సార్."

* * *

సంజయ్ గెస్‌హౌస్ చేరుకునేసరికి అతడు మత్తులో జోగుతున్నాడు.

అతడిని ఆ స్థితిలో చూసిన ధనుంజయ్, త్రివిక్రమ్‌తో చెప్పాడు. "మన సంభాషణ కెమెరాలో రికార్డ్ చేస్తే మంచిదేమో."

"ఎందుకు సార్?"

"మత్తులో అనేక నిజాలు బయటకొస్తాయి. మత్తు దిగాక తనా మాటలు చెప్పలేదని అనొచ్చు. అందుకే రికార్డెడ్ ఎవిడెన్స్ వుంటే మంచిది."

"పది నిముషాల్లో వస్తాను సార్" త్రివిక్రమ్ బయటకు పరుగెత్తాడు.

త్రివిక్రమ్ వచ్చాక లోపలికెళ్ళిన ధనుంజయ్ సంజయ్‌ని మాటల్లో దించాడు.

"లహరి హత్య మాకెంతో బాధ కలిగిస్తోంది. ఆ హంతకుడ్ని ఎలా పట్టుకోవాలో అర్థంకావడంలేదు." మాటల్లో బాధ ధ్వనించేలా పలికాడు.

"ఆ హంతకురాలు అంత సులభంగా దొరకదు" సంజయ్ అదోలా నవ్వాడు.

"హంతకురాలా... ఎవరు సార్... ...?!"

"నేను చెప్పనుగా..." మత్తుగా నవ్వాడు. ఏ విధంగా వాళ్ళు తనను వత్తిడి చేయరనే ధైర్యం.

"సో! హత్య ఎవరు చేసారన్నది సంజయ్‌కి తెలుసు. అందుకే అతడ్ని వెంటనే అదుపులోకి తీసుకున్నారు.

రికార్డెడ్ ఎవిడెన్స్‌ని తెలివిగా ప్రెస్‌కి అందించారు.

ఆ తర్వాత తప్పనిసరి పరిస్థితుల్లో సంజయ్ నిజం చెప్పాడు.

హత్య చేసింది అతడి భార్య- దేవిక.

హత్య చేయడానికి కారణం- గెస్ట్‌హౌస్‌కి భర్తకోసం వచ్చిన ఆమెకు లహరి భర్త కౌగిలిలో నలిగిపోతూ కనిపించడం! అందుకే భర్తనే అటాక్ చేయాలనుకుంది. పొరపాటున లహరిని కత్తితో పొడిచింది.

ల... హ.... రి... చనిపోయింది.

భయపడిన దేవిక, ఆమె శవాన్ని తీసుకెళ్ళి ఊరవతల పారేసింది.

* * *

"ప్రేమలో విఫలమైన లహరి, భర్తతోనూ సఖ్యంగా వుండలేక, చివరికి ఇలా ప్రాణాలు పోగొట్టుకోవడం బాధగా వుంది సార్." త్రివిక్రమ్ మనసు లోతుల్లోంచే వచ్చాయా మాటలు.

ధనుంజయ్ నిలువుగా తలాడించాడు. "అంత బాధలోనూ ఒక నిర్దోషిని శారీరకంగా హింసించకుండా కేసు ఓ కొలిక్కి తీసుకురాగలిగినందుకు చాలా సంతోషంగా వుంది. ఈ కేసు విషయంలో నీ సహకారం చాలా వుంది. థాంక్యూ త్రివిక్రమ్". అతడికేసి మెచ్చుకోలుగా చూసాడు.